# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేస్తూ.. పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ❖ నలుగురు మావోయిస్టు సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఎదుట ఈరోజు స్వచ్ఛందంగా లొంగిపోయారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధి, విద్యారంగాలకు సంబంధించి నిధుల కేటాయింపులు జరిగాయి. రాజధాని అమరావతి అభివృద్ధికి బడ్జెట్‌లో సుమారు 1,128.91 కోట్ల రూపాయలని ప్రాథమికంగా కేటాయించింది. అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కోసం 432.09 కోట్లు, గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు 500.99 కోట్లు, ఏపీ పట్టణ తాగు, మురుగు నీటిపారుదల నిర్వహణకు 800 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి 155.32 కోట్లు, రహదారులు, వంతెనల పునర్నిర్మాణం కోసం 350 కోట్ల రూపాయలు కేటాయించారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

========================

వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాగతించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పాత్రికేయులతో ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ అని అన్నారు. ఎం.ఎస్.ఎం.ఇ.ల ఏర్పాటుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని, మహిళలు, రైతులు, యువతకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వికసిత్ భారత్ వేగంగా సాకరమవుతుందని.. దేశ గతి మార్చే విధంగా బడ్జెట్ ఉందన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ - బెంగుళూరు, హైదరాబాద్ - చెన్నై, అమరావతి - తిరుపతి - చెన్నై రైల్ కారిడార్ ఏర్పాటు కానుందని.. మూడు కారిడార్ లు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర బడ్జెట్ పై శ్రీకాకుళంలో మంత్రి ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి పెడుతూ.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను రూపొందించారని పేర్కొన్నారు. పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గించడంతో పాటు.. కొబ్బరి, జీడి పంటలను ఆదుకునేలా తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అని అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్యులను మరింత ఆకట్టుకుందని కేంద్రమంత్రి తెలిపారు.

=======================

నలుగురు మావోయిస్టు సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఎదుట ఈరోజు స్వచ్ఛందంగా లొంగిపోయారు. చతిస్‌గఢ్‌కి చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుష మావోయిస్టు దళ సభ్యులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా అమిత్ బర్ధర్ మాట్లాడుతూ... ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలలో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు స్వచ్ఛందంగా లొంగిపోతున్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తున్నదని, అందువలనే ఆంధ్ర పోలీసుల వద్ద వారు లొంగిపోతున్నారని తెలిపారు. మావోయిస్టుల ప్రలోభాలకు గురికావద్దని, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని ప్రజలకు ఎస్పీ సూచించారు.

విరామం

=======================

ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేస్తూ.. పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో తొలి `పెయిన్ క్లినిక్`ను విశాఖలోని కేజీహెచ్ లో మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దీర్ఘకాలిక, క్యాన్సర్ సంబంధిత నొప్పులతో బాధపడుతున్న రోగులకు `పెయిన్ క్లినిక్` సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. `ఆంధ్ర మెడికల్ కాలేజ్ – నార్త్ అమెరికా అలుమ్ని` ఈ పెయిన్ క్లినిక్ కోసం కోటి రూపాయల విరాళం అందించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కీమోథెరపీ, రేడియోథెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి క్యాన్సర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు.

=======================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు జరగనుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బడ్జెట్ పై సామాజిక మాధ్యమం వేదికగా మంత్రి స్పందించారు. భారతదేశ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్రిటికల్ మినరల్స్

కారిడార్, హైస్పీడ్ రైలు అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఈ బడ్జెట్ కేటాయింపులు మరింత బలమైన ప్రోత్సాహం ఇస్తాయన్నారు. ఈ బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

========================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అమరావతి అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, హైస్పీడ్ రైల్వే కారిడార్, రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ ను కీలక భాగస్వామిగా ఎంపిక చేయడం వంటి పలు నిర్ణయాల పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు వాసి శ్రీనివాసులు మాట్లాడుతూ... బడ్జెట్ అందరి ప్రయోజనాలను పరిరక్షించే విధంగా ఉందని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో మంత్రి ఫరూక్ ఈరోజు మాట్లాడుతూ... పేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కేంద్రంలో మహిళలకు వివిధ వృత్తుల్లో నైపుణ్యం కల్పించి.. వారు స్వయం ఉపాధి పొందేలా చూస్తామన్నారు.

========================

రాజమహేంద్రవరం గ్రామీణ మండలం తొర్రేడులో పెద్దపులి సంచరిస్తోందని తూర్పు గోదావరి జిల్లా అటవీ అధికారి (DFO) పి. ప్రభాకర్ రావు తెలిపారు. పులి సంచరించిన ప్రాంతాలని ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... శనివారం సాయంత్రం సీతానగరం మండలంలోని చిన్నకొండేపూడి, పెదకొండేపూడి గ్రామాల సమీపంలో పెద్దపులి సంచరించిందన్నారు.

========================
========================